

కళాశాల భూములు జోలికొస్తే ఊరుకోం 2



ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## ఆర్మూర్ నుంచి ధర్మపురికి బస్సులు



**అక్షరటుడే, ఆర్మూర్:** ధర్మపురి లక్ష్మి నృసింహాస్వామి జాతరను పురస్కరించుకొని ఈనెల 27 నుంచి మార్చి 5 వరకు ఆర్మూర్ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్మూర్ ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. పెద్దలకు ఛార్జీ రూ.220, పిల్లలకు రూ.110 ఛార్జీ ఉందన్నారు. ఆర్మూర్ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆర్టీసీ బస్‌లలో ప్రయాణం సురక్షితం, సుఖవంతం, క్షేమమని డీఎం ఈ సందర్భంగా తెలిపారు.


26-2-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


# పసుపు రైతుల పడిగాపులు

**నిజామాబాద్ మార్కెట్ యార్డుకు పసుపు భారీగా చేరుకుంది. కానీ కొనుగోళ్లలో మాత్రం జాప్యం జరుగుతోంది. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తుండడంతో ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో పసుపు రైతులకు పడిగాపులు తప్పడం లేదు. రెండు రోజులుగా సర్వర్ లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

**–అక్షరటుడే, ఇందూరు**



**■ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌తో ఆటంకం ■ నిలిచిన కొనుగోళ్లు ■ ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు**

దేశంలోనే అత్యధికంగా పసుపు పండే జిల్లాలో నిజామాబాద్ మొదటి స్థానంలో ఉంటుంది. జాతీయ పసుపు బోర్డు కూడా నిజామాబాదులోనే నెలకొల్పారు. మహారాష్ట్రలోని సాంగ్లీతో పాటు నిజామాబాద్ మార్కెట్ యార్డుకు రైతులు భారీగా పసుపు తీసుకొస్తారు. సాధారణంగా ప్రభుత్వం పసుపు కొనుగోలును " ఈ నామ్" యాప్ ద్వారా చేస్తుంది. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా స్లాట్ బుక్ చేసి కమిషన్ ఏజెంట్లకు అందజేస్తుంది. అయితే గత రెండు రోజులుగా సర్వర్ ప్రాబ్లమ్‌తో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో పసుపు రైతులకు పడిగాపులు తప్పడం లేదు.

### 'ఈ నామ్' వెబ్‌సైట్‌లో..

ప్రస్తుతం ఉన్న " ఈ నామ్" వెబ్ సైట్ లో సాఫ్ట్‌వేర్ సమయం ముగిసింది. దీంతో నూతన సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ప్రస్తుత విధానం పదేళ్లుగా అమలులో ఉంది. దీంతో కొత్త ఫీచర్లతో పాటు, భద్రత పరంగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇటీవల వర్షాలతో సైతం రెండు రోజులు కొనుగోళ్లు జరగలేదు. దీంతో యార్డుకు పసుపు తెచ్చిన రైతులు నిరీక్షిస్తున్నారు.

### రైతుల ఆందోళన

పసుపు కొనుగోలులో జాప్యం ఏర్పడటంతో రైతులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్ కార్యాలయాన్ని ముట్టడించి దాడి చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రెండు రోజులుగా పడిగాపులు కాస్తున్నామని వెంటనే కొనుగోలు ప్రారంభించాలంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు కార్యాలయానికి చేరుకొని రైతులను సముదాయించారు. పసుపు వచ్చే సమయంలోనే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. ఇంతకాలం ఏం చేశారంటూ నిలదీశారు.


### వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి



పసుపు కొనుగోలు వెంటనే ప్రారంభించాలి. సర్వర్ లేదంటూ గత రెండు రోజులుగా నిలిపివేశారు. దీంతో మాకు ఇబ్బందులు తప్పడం లేదు. పసుపును తీసుకు రాకముందే సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేస్తే బాగుండేది. రైతులంతా పసుపు తీసుకొచ్చాక ఇలాంటి పనులు పెట్టుకోవడం సమంజసం కాదు.

**– సాగర్, కుద్వాన్ పూర్**

### పాత పద్ధతిలో వద్దు..



ఈ నామ్ సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో రెండు రోజులుగా ఎదురు చూస్తున్నాం. పాత పద్ధతిలో బీట్ వేస్తామని అధికారులు చెబుతున్నారు. అలా చేస్తే నష్టపోవాల్సి వస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో మేము ఒప్పుకోం. వీలైనంత తొందరగా ఆన్లైన్ ప్రక్రియ ద్వారా కొనుగోలు చేయాలి.

**– గంగ నర్సయ్య, నందిపేట్**

## వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండలం తిమ్మాపూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు భక్తుల కోలాహలంతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దేవనాథ రామానుజ జీయర్ స్వామి హాజరయ్యారు. కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి సతీమణి పుష్ప, కలిసి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవానికి ముందుగా నిర్వహించిన హోమ కార్యక్రమంలో పోచారం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణల మధ్య సాగిన ఈ ఉత్సవం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. ఈ సందర్భంగా పోచారం కుటుంబ సభ్యులు పోచారం శంభు రెడ్డి, ప్రేమ దంపతులు, మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, సోని రెడ్డి దంపతులు, శ్రీ పోచారం సురేందర్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్యభట్ట కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని గురువారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షలు ముగిసే వరకు కేంద్రాల వద్ద 165 బీఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల నుంచి 200 మీటర్ల లోపు అన్ని జిరాక్స్ కేంద్రాలను మూసివేయలన్నారు. పరీక్ష జరిగే ప్రాంతాలలో గుమిగూడవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం సెకండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని 37 పరీక్ష కేంద్రాలలో 7,878 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా మొదటి రోజు 7,733 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 145 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసుల బందోబస్తు మధ్య పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.

## భక్తుల ఇంటికే భద్రాచలం సీతారాముల కళ్యాణ తలంబ్రాలు



**అక్షరటుడే, ఇందూరు:** భద్రాచలం సీతారాముల కళ్యాణ తలంబ్రాలు భక్తుల ఇంటికి నేరుగా పంపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ఆర్టీసీ కార్గో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం జ్యోత్స్న తెలిపారు. భద్రాచలానికి వెళ్లలేని భక్తులు రూ.151 చెల్లించి తలంబ్రాలు పొందవచ్చన్నారు. ఆర్టీసీ అధికారిక వెబ్ సైట్ లో టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్‌ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

## జిల్లా కాంగ్రెస్ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్‌కు సన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జిల్లా కాంగ్రెస్ పరిశీలకుడిగా వ్యవహరించిన రిజ్వాన్ అర్షద్‌ను నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఘనంగా సన్మానించారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్‌లో భాగంగా జరిగిన శిక్షణ శిబిరంలో రిజ్వాన్ అర్షద్ తన ప్రజంటేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ రిజ్వాన్ అర్షద్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

## నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు రైతుల ఆందోళన



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు రైతులు గురువారం ఆందోళన నిర్వహించారు. పసుపు కొనుగోలులో జాప్యం జరుగుతుందంటూ కార్యాలయాన్ని ముట్టడించారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పేరుతో రెండురోజులుగా మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరపట్లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనవసరంగా కాలయాపన చేస్తున్నారని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము యార్డులోనే పడిగాపులు కాస్తున్నామంటూ మండిపడ్డారు. ఒక దశలో కార్యాలయ తలుపుల అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులను సముదాయించారు. అధికారులతో మాట్లాడారు సాధారణంగా ప్రభుత్వం పసుపు కొనుగోలును 'ఈ నామ్' యాప్ ద్వారా చేస్తుంది. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా స్లాట్ బుక్ చేసి కమిషన్ ఏజెంట్లకు అందజేస్తుంది. అయితే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌తో కొనుగోళ్లు నిలిచిపోయాయి.

## మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, బోధన్:** ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. పట్టణంలోని తొమ్మిది కేంద్రాల్లో ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభం కాగా.. కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా పోలీసులు పర్యవేక్షణ చేయాలన్నారు.

### సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి..

పరీక్షలు జరుగుతున్న సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. పట్టణంలోని తొమ్మిది సెంటర్లలో 3,007 విద్యార్థులకు గాను గురువారం 2,920మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అధికారులు ఉన్నారు.



## కోటగిరిలో చైన్‌స్నాచింగ్..

**అక్షరటుడే, కోటగిరి:** జిల్లా లో వరుస చైన్‌స్నాచింగ్ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామాల్లో, పట్ట ణాల్లో అనే తేడాలేకుండా ఎక్కడ పడితే అక్కడ దోపిడీకి తెగబడుతున్నారు. బంగారం ధర పెరుగుతూ పోతుండటంతో బంగారు ఆభరణాలకు రక్షణ లేకుండా పోతోంది. ముఖానికి మాస్కులు ధరించిన గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటన కోటగిరి మండలంలో చోటు చేసుకుంది. దీంతో గ్రామంలో మహిళలు భయాందోళన చెందుతున్నారు. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం కోటగిరి మండల కేంద్రంలోని వినాయక నగర్‌కు చెందిన ఏముల లింగవ్వ (65) 25న రాత్రి ఇంట్లో ఒక్కరే ఉండగా.. ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి గోడదూకి వచ్చి వృద్ధురాలి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు.

## ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

**అక్షర టుడే, ఇందూరు:** ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొత్తం 16,228 మంది విద్యార్థులకు గాను 16,563 మంది హాజరయ్యారు. 335 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ విద్యాధికారి రవికుమార్, హై పవర్ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులు 54 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొదటి రోజు ఎటువంటి చూచిరాత కేసులు నమోదు కాలేదు.

## కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు ప్రాధాన్యత: ఈరవత్రి



**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. ఆర్మూర్ బల్దియా ఛైర్‌పర్సన్ లహరి, వైస్ ఛైర్మన్ కాట్‌పల్లి వెంకట రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ.. జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్‌లలో బీసీ మహిళలకే ప్రాధాన్యత ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 42శాతం రిజర్వేషన్లను ఖరారు చేస్తే కేంద్రంలో మోకాలడ్డు పెడుతోందన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయట్లేదని గగ్గోలు పెడుతున్న ప్రతిపక్ష పార్టీల్లోనే వ్యక్తులే కోర్టుల్లో కేసులు వేసి బీసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 64శాతం వరకు బీసీలకు బల్దియా పీఠాలను అప్పజెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి మాట్లాడుతూ..మున్సిపల్ ఎన్నికల్లో ఆర్మూర్ ప్రజలు ఇతర పార్టీలను తిరస్కరించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మతిభ్రమించి ఆర్మూర్‌లో తిరుగుతున్నాడని, జీవన్ రెడ్డిని ఆస్పత్రిలో చూపించాలని పేర్కొన్నారు.

టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ చిన్నా మాట్లాడుతూ..ఎంపీ అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆర్మూర్‌కు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. బీసీ పద్మశాలి బిడ్డను ఆర్మూర్ ఛైర్‌పర్సన్‌గా చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రీతికరమైన నియోజకవర్గం ఆర్మూర్ అన్నారు. ఆర్మూర్ నుంచి పాదయాత్ర చేసిన రేవంత్‌రెడ్డి సీఎం వరకు ఎదిగారన్నారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వారి నిధులనుంచి మున్సిపల్ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందన్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి ఆర్మూర్ నియోజవర్గంపై ప్రత్యేక దృష్టి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి, వైస్ ఛైర్మన్ కాట్‌పల్లి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు కౌన్సిలర్లకు సన్మానం




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి విజయం సాధించిన మున్నూరు కాపు కౌన్సిలర్లను గురువారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మున్నూరు కాపు మూడు పంథల సదర్లు, పెదకాపుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా ఎన్నికైన మున్నూరు కాపు కౌన్సిలర్లు నర్మే నవీన్, సడక్ వినోద్, కొడిగెల మల్లయ్య, పోచంపల్లి శ్రీనివాస్, యమాద్రి కవిత భాస్కర్, తాటి నీలిమ హన్మాండ్లు, బోగడమీది రాణి సుమన్‌లను సన్మానించారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన





అక్షరటుడే, ఆర్మూర్: ఆలూరు మండల కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ సంచాలకులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిచంగా ఏవోలు రాంబాబు, విజయలక్ష్మిలు మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతులను అనుసరించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో చీడపీడల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీవామృతం, ఘన జీవామృతం వంటి సేంద్రియ పదార్థాల తయారీ విధానాలను వివరించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా మాత్రమే ఎరువులు వాడాలని, తద్వారా ఖర్చులు తగ్గి దిగుబడులు మెరుగుపడతాయన్నారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష ఫలితాల కార్డులను రైతులకు అందజేశారు. సర్పంచ్ ముక్కెర విజయ్, ఏఈవో వసుధం, ప్రకృతి వ్యవసాయం సీఆర్పీ కొత్తూరు సుజాత గంగాధర్, ములకడి శ్రీనివాస్ రెడ్డి, నడిసారం మల్లయ్య, తిరుమలపల్లి నవనీత్, పెంద ఉదయ్ పాల్గొన్నారు.

## ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం గురువారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ ఉద్యమంలో విరోచిత పోరాటం చేసిన యోధురాలు అని పేర్కొన్నారు. ఆమె చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. విగ్రహ నిర్మాణంతో భవిష్యత్ తరాలకు చాకలి ఐలమ్మ జీవితం, పోరాట చరిత్ర స్ఫూర్తినిస్తుందని, ఆలూర్ మండలానికి ఇది గౌరవకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూర్ సర్పంచ్ ముక్కెర విజయ్, గుత్ప సర్పంచ్ దశరథ్, ఉప సర్పంచ్ ఏలేటి మోహన్ రెడ్డి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు భూపానపల్లి శంకర్, ఆలూర్ రజక కమిటీ సభ్యులు లింగం, రాం, గంగారాం, రమేష్, గంగాధర్, శ్రీను, భాజన్న, పోశెట్టి, గ్రామ కాంగ్రెస్ నాయకులు నవనీత్, ఉదయ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో వారం రోజుల ప్రత్యేక శిబిరం గురువారం ముగిసింది. ఈ శిబిరంలో విద్యార్థులు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటడం, అవగాహన ర్యాలీలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ తిరుక్కోవేల వేణుగోపాల్ స్వామి మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ శిబిరాలు విద్యార్థుల్లో సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయన్నారు. పుస్తకాలు, పాఠాలతో పాటు సమాజంతో మమేకం కావడం ద్వారా నిజమైన విద్యా పరిపూర్ణత సాధ్యమవుతుందన్నారు. అటు తర్వాత సర్పంచ్ కొండి నడ్పి గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, వార్డ్ మెంబెర్ ఆకాష్, వీడీసీ పెద్దలు పాల్గొన్నారు.



## కళాశాల భూముల

# జోలికొస్తే ఊరుకోబోం

■ విద్యార్థి సంఘాల హెచ్చరిక.. ■ పలువురి అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశానికి సన్నాహాలు చేస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

**ఎమ్మెల్యే బాధ్యత వహించాలి..**

విద్యార్థుల భవిష్యత్ కోసం సేకరించిన కళాశాల భూములు అప్పనంగా ఇతర కళాశాలలు, పాఠశాలలకు కేటాయించారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. సదరు కళాశాలలు, పాఠశాలలు డిగ్రీ కళాశాలకు అద్దె చెల్లించడం లేదని, వెంటనే అరోరా కళాశాల, సరస్వతి శిశు మందిర్‌లకు ఇచ్చిన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కమిటీలో వెంకట రమణారెడ్డి ఉన్నప్పుడే ఈ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అరోరా కాలేజీకి 26 ఎకరాల భూమి అప్పగించడంలో ఎమ్మెల్యే రమణారెడ్డి కీలకపాత్ర వహించారని ఆరోపించారు. శిశు మందిర్ పాఠశాలకు కూడా రెండు ఎకరాల భూమిని అక్రమంగా లీజుకు ఇచ్చారన్నారు. వీటన్నింటికి ఎమ్మెల్యే రమణారెడ్డి బాధ్యత వహించాలన్నారు.

**రైతుల భూములను..**

రైతుల కష్టార్జితమైన భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జా చేయనివ్వమని వారు పేర్కొన్నారు. కాలేజీ భూముల పేరుతో జరిగిన అవినీతిని ప్రజల ఎదుట బహిర్గతం చేస్తామని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కబ్జాకు గురైన ప్రతి ఎకరం భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. కామారెడ్డి పరిసర గ్రామాల విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని భూములను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయడమే అసలు లక్ష్యమని వెల్లడించారు.

**ఏకతాటిపైకి వచ్చి పోరాడుతాం..**

ఏ లక్ష్యంతో రైతులు భూములు ఇచ్చారో ఆ లక్ష్యం నెరవేరే వరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పోరాడుతామని, అప్పటిదాకా విద్యార్థి సంఘాలు వెనుకడుగు వేయవని ప్రకటించారు. పోలీసుల ముందస్తు అరెస్టులతో సమావేశం నిలిచిపోయినా ఉద్యమస్ఫూర్తి మాత్రం మరింత బలపడిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల స్వరం అణచివేయలేరని, ఇది కేవలం భూముల కోసం పోరాటం కాదని, విద్యాహక్కు కోసం, భవిష్యత్ తరాల కోసం జరుగుతున్న ఉద్యమమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆజాద్, సందీప్ కుమార్, జీవీఎం విఠల్, అరుణ్, లక్ష్మణ్, నాగరాజు, భరత్, వినోద్, వినయ్, సోఫియన్, డేవిడ్, రాహుల్ పాల్గొన్నారు.

## కుమ్మెర మల్లన్న జాతర ఘటన బాధితులకు న్యాయం చేయాలి



**అక్షరటుడే, బోధన్:** కుమ్మెర మల్లన్నజాతర ఘటనపై బాధితులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని రజక సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. బోధన్, సాలూర మండలాల రజక సంఘం నాయకులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ అనూషకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రజక సంఘం నాయకులు కొలిపాక బాలరాజు మాట్లాడుతూ కుమ్మెర మల్లన్న జాతరలో కుల వివక్షలో భాగంగా జరిగిన దాడిలో మృతి చెందిన శిశువు కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దాడిలో చాకలి చంద్రకళ కుటుంబంపై జరిగిన వివక్షతను సాలూర మండల రజక సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ కార్యక్రమంలో ఆయా కుల సంఘాల నాయకులు, గ్రామాల సర్పంచ్, రజక సంఘం ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో తపాల సేవలు విస్తరించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** గ్రామీణ ప్రాంతాల్లో తపాల సేవలను విస్తరించాలని తెలంగాణ సర్కిల్, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, వీణకుమారి, హైదరాబాద్ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ సుమిత అయోధ్య, డైరెక్టర్ నరేష్ పేర్కొన్నారు. ఈ మేరకు భిక్కనూరు, దోమకొండ, జంగంపలి మండలాల్లో పనిచేస్తున్న 17 మంది బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లతో భిక్కనూరులోని సమీక్ష నిర్వహించారు.

**సేవల్లో నిర్లక్ష్యం వద్దు..**

మహిళ స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు గ్రామంలో నిర్వహించే వివిధ రకాల సమావేశాల్లో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు కూడా పాల్గొనాలని వారు సూచించారు. తపాలా శాఖ అందిస్తున్న జీవిత బీమా, పొదుపు ఖాతాలు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ వేతనాల పంపిణీ వంటి సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. తపాల శాఖ ప్రతినిధులుగా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు గ్రామీణ ప్రాంతాల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. తపాలా శాఖ ప్రతి ఏడాది టెక్నాలజీ డెవలప్‌మెంట్, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అభివృద్ధి పనులకు గణనీయంగా ఖర్చు చేస్తుందని అధికారులు పేర్కొన్నారు. వీటి ఫలాలను ప్రజలకు అందించాలని కోరారు. డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళల లోన్ చెల్లింపులను బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు స్వీకరించాలని సూచించారు. బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులు కనీసం 33శాతం ఆదాయం కలిగి ఉండాలని లేకపోతే బీవోలను మూసివేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా తపాల పర్యవేక్షుడు జనార్ధన రెడ్డి, సహాయ పర్యవేక్షకుడు వీరేంద్ర కుమార్, కామారెడ్డి ఇన్‌స్పెక్టర్ సుజిత్ కుమార్, బోధన్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్, ఎంవోలు వెంకట్రామిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహరాజ్ జయంతిని విజయవంతం చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని భారత్ గార్డెన్‌లో అధికారికంగా నిర్వహిస్తున్నట్లు బంజారా నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని తండాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, బంజారా సమాజానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్, ఆల్ ఇండియా జాతీయ శక్తిపీఠ్ ప్రధాన కార్యదర్శి బద్యానాయక్, బంజారా సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్ సింగ్, ఆదివాసి కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ నరేష్ రాథోడ్, కాద్లాపూర్ మాజీ సర్పంచ్ భాస్కర్, ఇబ్రహీంపేట్ తండా మాజీ సర్పంచ్ ప్రేమ్ సింగ్, నస్రుల్లాబాద్ మాజీ ఎంపీపీ విఠల్, సక్రునాయక్, ఏఐబీఎస్ఎస్ కామారెడ్డి జిల్లా ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ్యానాయక్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత దంత వైద్యశిబిరం




**అక్షరటుడే, ఇందూరు:** శీను నాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 199 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు, గ్రామస్థులకు దంత సంరక్షణపై వైద్యుడు ముఖేష్ అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా బ్రష్ చేసుకోవాలని సూచించారు. దంత సమస్య వస్తే నిర్లక్ష్యం చేయవద్దన్నారు. వెంటనే దంత వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రజొన్నకు మద్దతు ధర ఇవ్వాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** ఎర్రజొన్నకు మద్దతు ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ కిసాన్ మోర్చా నాయకుడు నూతన శ్రీనివాస్‌రెడ్డి గురువారం మాట్లాడారు. ఈ ఏడాది ఎర్రజొన్న పంట విస్తీర్ణం చాలా తగ్గిందన్నారు. మొక్కజొన్న సాగు పెరిగిందన్నారు. ఎర్రజొన్న పంట విస్తీర్ణం తగ్గడంతో రైతులకు రూ.5వేలకు పైన మద్దతు ధర వస్తుందని ఆశించామని.. కాని ప్రస్తుతం రూ.3,800 క్వింటాలకు పంటను కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చొరవచూపి మద్దతు ధర ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**అక్షరటుడే, బాన్సువాడ:** లయన్స్ క్లబ్ బీర్కూర్ ఆధ్వర్యంలో బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రి సహకారంతో బీర్కూర్ మండలం బరంగేడ్గిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 142 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 37 మందికి మోతిబిందు సమస్య ఉన్నట్లు గుర్తించారు. వారికి శస్త్రచికిత్స నిమిత్తం బోధన్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు అజయ్, రాకేష్ యాదవ్, బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సితలే రమేష్, సర్పంచ్ రెంజర్ల అనిల్ కుమార్, లయన్స్ క్లబ్ క్యాంప్ ఇన్‌ఛార్జి హన్మంతు రావ్ పటేల్, లయన్ సభ్యులు కార్తీక్ పటేల్, పంచరెడ్డి అనిల్ కుమార్, పంచాయతీ సెక్రటరీ గురునాథ్, వార్డు సభ్యులు అనిల్, గైని సాయిలు, గ్రామ యువకులు మనోజ్ దేశాయ్, బస్వంత్ పటేల్, గంగారాం పటేల్, జగం అశోక్, హన్మగొండ తదితరులు పాల్గొన్నారు.

## ఎనీమియా బాధితుడికి రక్తదానం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లా కేంద్రంలోని పాజిటివ్ వైద్యశాలలో ఎల్లారెడ్డికి చెందిన వృద్ధుడు ప్రభు (80) ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నాడు. అతడికి అత్యవసర స్థితిలో రక్తం అవసరం ఉండగా ఐవీఎఫ్ యువజన విభాగం స్పందించింది. యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎర్రం ఈశ్వర్ గుప్త సహకారంతో పట్టణానికి చెందిన చీటి నిఖిల్ రావ్, మహిత్ గౌడ్‌లు స్పందించి సకాలంలో రక్తదానం చేశారు. ఈ మేరకు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర ఛైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు మాట్లాడుతూ యువకులు రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు.

## ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీ పట్టివేత



**అక్షరటుడే, బాల్కొండ:** ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు బాల్కొండ ఎస్సై సుహాసిని వివరాలు వెల్లడించారు. బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బంది నైట్ పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో చిట్టాపూర్ గ్రామ పరిధిలో వేగంగా వెళ్తున్న లారీని అడ్డుకుని తనిఖీ చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి లారీని సీజ్ చేశారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని.. డ్రైవర్, లారీ యజమాని రమేశ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.